క్లుప్తంగా

కంటి వైద్య శిబిరం



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సామాజికవేత్త మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందంచే స్థానిక రామకోటి ప్రాంగణంలో నేత్రవైద్య శిబిరం ఏర్పాటుచేశారు. 135 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 18 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరిని వేమగిరి ఆసుపత్రికి తరలించారు. 36 మందికి కళ్లజోళ్లు సబ్సిడీ ధరకు అందజేశారు. ఈ శిబిరాన్ని ఎస్ఎంఆర్ పెదబాబు ప్రారంభించారు. రామారావు గత 15 సంవత్సరాలుగా తన సొంత ఖర్చుతో ప్రతి నెలా మూడో ఆదివారం ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బొలిశెట్టి సురేష్ కుమార్, తమ్మన అజయ్, పిల్లి పండరీనాథ్ వచ్చిన వారికి సేవలు అందించారు.

కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజలు, భక్తుల అవసరాల నిమిత్తం స్థానిక ఆదివారపేట మార్కెట్ సమీపంలో శ్రీ ప్రేమ సాయి మందిర్ వద్ద ఉన్న కార్పొరేషన్ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఎమ్మెల్యే చంటి సతీమణి మీనా, కార్పొరేటర్ ఇలియాస్ పాషా, శ్రీ షిర్డీ సాయి ప్రేమ మందిర్ చైర్మన్ ఇసుకపల్లి తాతారావు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

దెందులూరు: కొవ్వలిలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారికి పలు రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆలయ వార్షికోత్సవాలకు తరలి వచ్చిన సుమారు 3 వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాలు

- పక్కాగా కట్టడాల నిర్మాణం
- అధికార పార్టీ అండదండలతో ఇష్టారాజ్యం
- నగరంలో పాదచారులకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు





ఎన్ఆర్‌పేటలో ఫుట్‌పాత్‌పైకి వచ్చేసిన వ్యాపారులు, జిల్లా పరిషత్ సెంటర్‌లో ఫుట్‌పాత్‌పై నిర్వహిస్తున్న టీ స్టాల్, టేబుల్



కర్రల వంతెన నుంచి వసంత మహల్ సెంటర్‌కు వచ్చే దారిలో ఫుట్‌పాత్‌పైనే కూరగాయల వ్యాపారం



ఆర్ఆర్‌పేటలోని వెంకటేశ్వరస్వామి గుడి సెంటర్‌లో ఫుట్‌పాత్‌పై నిర్వహిస్తున్న చిరు వ్యాపారులు

ఏలూరు (టూటౌన్) : ఏలూరు నగరంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని యథేచ్ఛగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. బడాబాబులను చూసి చిరు వ్యాపారులు సైతం ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. తమకు సంబంధించిన చోటా నాయకులతో కొద్దికొద్దిగా ఫుట్ పాత్‌లపై చిన్న బడ్డీ కొట్లు, టీ స్టాల్స్, తోపుడు బండ్లు వంటివి పెట్టిస్తున్న నాయకుల విషయంలో అధికారులు చర్యలు తీసుకోకపోవడం చూసి తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. దీంతో బడా నాయకులు సైతం ఫుట్ పాత్‌లపైనే కౌంటర్‌లు, టీ స్టాల్స్ వంటివి ఏర్పాటుచేసేస్తున్నారు. రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్న తమను ఎవరూ ఏమీ చేయలేరులే అనే ధీమా లేదా తమ పలుకుబడి ముందు అధికారులు ఏం చేస్తారులే అనే భరోసా కావచ్చు కొందరునేతలు నగరంలో విచ్చలవిడిగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించేసి వ్యాపారాలు చేసేస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన నగరపాలక సంస్థ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఫుట్‌పాత్‌లు వ్యాపారాలకు నెలవుగా మారడంతో పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

జెడ్పీ సెంటర్‌లో..

నిత్యం రద్దీగా ఉండే జిల్లా పరిషత్ సెంటర్‌లో జిల్లా అధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇదే క్రమంలో ఆదాయం పెంచుకునే క్రమంలో జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఈ కాంప్లెక్స్‌లో పలు వ్యాపారాలను ప్రారంభించారు. జిల్లా పరిషత్ సెంటర్ నుంచి ఇండోర్ స్టేడియం వైపు వెళ్లే దారిలో టీడీపీకి చెందిన నాయకుడు ఒకరు రెండు షాపులను లీజుకుతీసుకుని వాటిలో ఫుడ్ ఐటమ్స్‌కి సంబంధించిన వ్యాపారం చేస్తున్నారు. ఆయనకు పక్కనే మరో చోటానాయకునితో హోటల్ ఏర్పాటుచేయించారు. ఇందులో భాగంగా టీ స్టాల్‌ను ఏకంగా ఫుట్‌పాత్‌పైనే ఏర్పాటుచేసేశారు. రాజకీయ పలుకుబడి ఉన్న వారితో తమకెందుకులే అనే ధోరణిలో నగరపాలక సంస్థ అధికారులు వ్యవహరించారనే విమర్శలూ ఉన్నాయి.

ఫుట్‌పాత్ ఖాళీగా ఉందో పాగా వేసేస్తారు

ఏలూరు నగరం వన్‌టౌన్, టూటౌన్, త్రీ టౌన్ ప్రాంతాలుగా విస్తరించి ఉంది. ఈ ప్రాంతాల్లో ప్రజల అవసరాల కోసం, పాదచారుల రాకపోకలకు అనువుగా ఫుట్‌పాత్‌లను నిర్మించారు. ఈ ఫుట్‌పాత్‌లపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఎక్కడికక్కడ ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ఫుట్‌పాత్ ఖాళీగా కనిపించిందో నాయకుల అండదండలతో వ్యాపారులు పాగా వేసేస్తున్నారు. ఇందుకు నరసింహారావుపేట, ఆర్ఆర్‌పేట, పవర్‌పేట, వన్‌టౌన్‌లోని మెయిన్ బజారు ఇలా చెప్పుకుంటూ పోతే కోకొల్లలుగా నిదర్శనాలు కంటికి కన్పిస్తున్నాయి. అయినా ఇవేమీ అధికార యంత్రాంగానికి కన్పించకపోవడం పట్ల నగర వాసులు విస్తుపోతున్నారు.

ఆక్రమణ బాధాకరం



ప్రజలకు ఉపయోగపడే ఫుట్‌పాత్‌లను ఆక్రమించేసి నిర్మాణాలు చేపట్టడం ఎంతో బాధాకరంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే జిల్లా పరిషత్ సెంటర్‌లో ఇటువంటి చర్యలకు ఉపక్రమిస్తుంటే నగరపాలక సంస్థ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. జిల్లా స్థాయి అధికారులూ చోద్యం చూస్తుండటం విడ్డూరంగా ఉంది. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా తగుచర్యలు తీసుకోవాలి.

– జె.గోపి, సీఐటీయూ నాయకులు, ఏలూరు

అక్రమ వ్యాపారాలను తొలగించాలి



ఫుట్‌పాత్‌లను ఆక్రమించేసి నిర్మాణాలు చేపట్టడం, వ్యాపారాలు చేసే వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలి. నిర్మించిన కట్టడాలను తొలగించాలి. పేదవారు రోడ్డు పక్కగా చిన్న బడ్డీ కొట్టు, తోపుడు బండి పెట్టుకుని జీవనోపాధి పొందుతుంటే ఆఘమేఘాల మీద వచ్చి తొలగించే అధికార యంత్రాంగానికి, ఫుట్‌పాత్‌ల ఆక్రమణ పోవడం శోచనీయం. అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి.

– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిలా ఏపీయూడబ్ల్యూజే



కేక్ కట్ చేస్తున్న యూనియన్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిలా ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) పని చేస్తుందని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేపీకే కిషోర్ తెలిపారు. యూనియన్ 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక దొండపాడులోని పరివర్తన్ బదిరుల పాఠశాలలో బదిర విద్యార్థుల సమక్షంలో వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటిని పరిష్కరించడంలో 68 ఏళ్లుగా కీలకంగా యూనియన్ పని చేస్తోందని తెలిపారు. అనంతరం బదిర విద్యార్థులకు స్నాక్స్, డ్రింక్స్ పంపిణీ చేశారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాగిత మాణిక్యరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు జీవీఎస్ఎన్ రాజు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి శీర శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ఉర్ల శ్రీను, జిల్లా సంయుక్త కార్యదర్శి సీహెచ్ రామకృష్ణ రాజు, ఏపీ ఫొటో జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్‌కే రియాజ్, సభ్యులు ఫొటోగ్రాఫర్ కృష్ణ, గుజ్జు శ్రీధర్, పరివర్తన్ బదిరుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు పేరుతో మరో మోసం



మండల సరస్వతి

దెందులూరు: ఉచిత బస్సు పేరిట మహిళలను కూటమి ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని ఏలూరు జెడ్పీటీసీ మండల సరస్వతి ఆరోపించారు. ఆదివారం శ్రీపర్రులో ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత బస్సు రాష్ట్రమంతా ఫ్రీ, ఏ కండక్టర్ డ్రైవర్ అని అడిగితే తన పేరు చెప్పండి అని పదేపదే హామీలు ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పథకం ప్రారంభించి ఇప్పుడు తిరుపతికి ఉచిత బస్సు లేదని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ నిర్ణయం మహిళలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తిరుపతి వెళ్లేందుకు నేరుగా ఉచిత సౌకర్యం ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి నగరం ఆంధ్రప్రదేశ్‌లో లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎంత మంది మహిళలు ఉన్నారు. కేటాయించిన బస్సులు ఎన్నో రాష్ట్ర ప్రజలు మహిళలు అందరూ నిశితంగా గమనిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు రాష్ట్రమంతా ఉచిత బస్సు సౌకర్యం అని ఏకకాకి చెప్పారని ఇప్పుడు ఆ పథకం అమలు చేయడానికి 100 షరతులు, 100 నిబంధనలు అమలు చేస్తున్నారన్నారు. మహిళల నుంచి నిరసనలు ఉధృతం కాకముందే ప్రభుత్వం తిరుపతి వెళ్లేందుకు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు సౌకర్యం తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు.

రాట్నాలమ్మకు రూ.85,133 ఆదాయం

పెదవేగి: రాట్నాలమ్మకు పలు ప్రాంతాల నుంచి చేరి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మ దేవస్థానం రాట్నాలకుంటలో అమ్మవారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కుబడులను తీర్చుకునేందుకు బారులు తీరారు. ఈ వారం అమ్మవారికి పూజా రుసుముల ద్వారా రూ.49,930, విరాళాల ద్వారా రూ.5,083, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.24,600, పులిహోర అమ్మకం ద్వారా రూ.1,725, ఫొటోల అమ్మకం ద్వారా రూ.3,795, మొత్తం ఆదాయం రూ.85,133 ఆదాయం లభించిందని దేవస్థాన కార్య నిర్వహణాధికారి ఎన్.సతీష్ కుమార్ తెలిపారు.

గణపతి ఉత్సవాలకు ఏర్పాట్లు

దెందులూరు: గోపన్నపాలెంలోని ప్రముఖ దేవాలయమైన శ్రీగణపతి నవరాత్రుల ఎనిమిదో వార్షిక ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభించారు. ఆదివారం బాల గణేష్ యూత్ సభ్యులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు నవరాత్రుల మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయని బాల గణేష్ యూత్ కమిటీ సభ్యులు అన్నారు.

టెన్త్ టాపర్లకు మెరిట్ స్కాలర్‌షిప్

దెందులూరు: గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన చైతన్యశ్రీకి రూ.2 వేలు, రెండో ర్యాంక్ సాధించిన దిలీప్‌కు రూ.1500 ఇంగ్లిష్‌లో టాపర్ చైతన్యశ్రీకి రూ.1500 మెరిట్ స్కాలర్‌షిప్‌ను ఆదివారం ఆకుల ఉమాలక్ష్మి నరసింహారావు చారిటబుల్ ట్రస్ట్ తరఫున వారి కుమారులు ఆకుల శ్రీధర్, ఆకుల ప్రసాద్ చెక్కులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడ్లపట్ల విజయకుమార్ విజేతలకు చెక్కులను అందజేసి అభినందించారు.

ఆక్వా రంగాన్ని కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ట్రంప్ సుంకాలు తగ్గించుకోవాలని, ఆక్వా రంగాన్ని కాపాడాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనం వీడాలని వక్తలు డిమాండ్ చేశారు. ట్రంప్ సుంకాలు ఆక్వా కుదేలు అనే అంశంపై స్థానిక పవరుపేటలోని సీపీఎం ఏలూరు జిల్లా కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన నిర్వహించారు. రవి, సీపీఐ ఏలూరు జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కాంగ్రెస్ జిల్లా నాయకుడు రాజనాల రామ్మోహనరావు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వ్యవసాయ, ఆక్వా తదితర ఉత్పత్తులపై పన్నులు 50 శాతం పైగా వేయటంతో ఆక్వా పరిశ్రమ ఒక్కసారిగా కుదేలైందన్నారు. అమెరికా పన్నుల బూచి చూపి ట్రేడర్లు, కంపెనీలు ధర తగ్గించి కొంటున్నారని, రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్వా రంగంపైనే కాకుండా దేశంలో వ్యవసాయ ఉత్పత్తులపై కూడా ట్రంప్ సుంకాల ప్రభావం పడుతోందన్నారు. అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా గతంలోవలె కౌంటుల వారీగా ధరలు నిర్ణయించి ఎక్స్‌పోర్టర్లు, ట్రేడర్లతో అమలు చేయించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ జోక్యం పథకం (ఎంఐఎస్) ద్వారా సబ్సిడీ ధర ఇవ్వాలని, నాణ్యమైన సీడ్, ఫీడ్ అందేల చూడాలని, ధరలు నియంత్రించాలని, విద్యుత్ రాయితీ, ట్రాన్స్ ఫార్మర్లు ఇవ్వాలని, దేశంలో వినియోగం పెరిగేలా (డొమెస్టిక్) చర్యలు తీసుకోవాలని, మార్కెట్ యార్డుల్లో, సొసైటీల్లో శీతల గిడ్డంగులు నిర్మించి రైతాంగానికి అందుబాటులోకి తేవాలని, కేంద్రం ఎక్స్‌టెన్సీ నిధులు ఇచ్చి ఆక్వా ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు బండి వెంకటేశ్వరరావు, డీఎన్‌వీడీ ప్రసాద్, ఆర్ లింగరాజు, పి.రామకృష్ణ, గుడిపాటి నరసింహారావు, ఎం ఇస్సాక్, డి.చంద్రశేఖర్, పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు



పట్టిసీమ ఔట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి నదిలోకి చేరుతున్న కొవ్వాడ అధిక జలాలు

పోలవరం రూరల్: అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రైతాంగం ముమ్మరంగా వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. గత రెండు నెలలుగా వర్షాలు లేక, నాట్లు పడక, చెరువులు నిండకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలతో కొండవాగులు ఇప్పుడిప్పుడే పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండుకుండలా మారుతున్నాయి. కొవ్వాడ కాలువ, పేడ్రాల, నక్కల గొయ్యి, ఇసుక కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొవ్వాడ కాలువ అధిక జలాలు పట్టిసీమ ఔట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి నదిలోకి చేరుతున్నాయి. ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ కూడా 84 మీటర్లకు చేరుకుంది. వర్షాలు ముమ్మరంగా కురుస్తుండటంతో పంట పొలాలు నాట్లు వేసి కళకళలాడుతున్నాయి.

ప్రభుత్వం సాకులు చెప్పడం సరికాదు



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కుక్కునూరు: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు వర్తింపజేయకపోవడంపై ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె కుక్కునూరులో విలేకరులతో మాట్లాడారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై షరతులు పెట్టడం సరికాదన్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినా విలీన మండలాలపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపుతోందని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం కుంటి సాకులు చెప్పడమేంటని ప్రశ్నించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో అంతరాష్ట్ర బస్సు సర్వీసు పేరుతో నిలిపివేయకుండా ఉచిత బస్సు ప్రయాణాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చంద్రకళ, పద్మ, రమ్య, తిరుపతమ్మ, లక్ష్మి, భవాని, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో విగ్రహాల ఏర్పాటు

దెందులూరు: పోతునూరు పంచాయతీ కొత్తూరు లో నూతనంగా నిర్మించిన శ్రీ గౌరీ శంకరుల ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహాల వాయు ప్రతిష్ఠ నిర్వహించారు. తొలుత విగ్రహాలకు అభిషేకం హోమాలు, పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ గౌరీ శంకరులు, విఘ్నేశ్వర కుమార, ఆంజనేయ స్వాముల విగ్రహాలు, వాయు ప్రతిష్ఠ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొత్తూరు పోతునూరుతో పాటు సమీప గ్రామాల్లో అధిక సంఖ్యలో భక్తులు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. విగ్రహాల శిల్పి మేస్త్రి పండితులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

23, 24వ తేదీల్లో వాలీబాల్ పోటీలు

జంగారెడ్డిగూడెం: గ్రామీణ యువతను ప్రోత్సహించి క్రీడా స్ఫూర్తిని పతాక స్థాయికి తీసుకెళ్లాలన్న మహోన్నత ఆశయంతో గత 16 సంవత్సరాలుగా ఇషా ఫౌండేషన్ ప్రతిష్టాత్మకంగా గ్రామోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఇషా ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం జంగారెడ్డిగూడెంలో వారు మాట్లాడుతూ గారెడ్డిగూడెం గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించే వాలీబాల్ పోటీలకు 14 ఏళ్లు పైబడిన గ్రామీణ యువత అర్హులని పేర్కొన్నారు. క్లస్టర్ స్థాయిలో విజేతలకు మొదటి, రెండు, మూడు, నాలుగో బహుమతులుగా రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు అందజేయనున్నట్టు వివరించారు. విజేతలు డివిజన్ స్థాయిలో సెప్టెంబర్ నెలలో గుంటూరులో జరిగే పోటీల్లో పాల్గోవాల్సి ఉంటుందని తెలిపారు. ఫైనల్ పోటీలు తమిళనాడులోని కోయంబత్తూరులో సెప్టెంబర్ 21న నిర్వహిస్తారని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు ఇషా ఫౌండేషన్ వలంటీర్ల ఫోన్ నంబర్లు 95819 01043, 93461 87098లో సంప్రదించాలని సూచించారు.

వైభవంగా కృష్ణుని విగ్రహ నిమజ్జనోత్సవం

భీమడోలు: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం రాధాకృష్ణుని విగ్రహ నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భీమడోలు జంక్షన్ ప్రాంతానికి చెందిన రాజస్థానీ కుటుంబాల వారు కొన్నేళ్లుగా ఇక్కడ కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వారు రాధాకృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు, భజన సంకీర్తనలు నిర్వహించారు. మహిళలు, యువతులు విగ్రహానికి భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవం చేశారు. పవిత్ర గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	24	బీన్సచిక్కుడు	68
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	20	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	42	కంద	00
కాకర కాయలు	20-24	బీట్‌రూట్	38
బీరకాయలు	00	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	30	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	26	చుక్కకూర	12
గోరుచిక్కుడు	30	గోంగూర	07-10
దోసకాయలు	26	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	46

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	00
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు- బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	98515	21
ఏలూరు- బీహెచ్‌ఈఎల్	22.10	98503	20
ఏలూరు - తిరుపతి	16.00	4830	26